సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



రైళ్ల రద్దు, దారి మళ్లింపు
విజయనగరం జిల్లాలో జరిగిన రైళ్ల ప్రమాద ఘటన నేపథ్యంలో సుమారు 47 రైళ్లు రద్దు చేయగా 24 రైళ్లను దారి మళ్లించారు. IIలో



170 అదనపు బస్సులు
విజయనగరం జిల్లాలో రైళ్ల ప్రమాద నేపథ్యంలో ఆర్టీసీ 170 అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. IIలో



సచివాలయ వ్యవస్థ ఆదర్శం
సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శనంగా నిలిచిందని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. IIలో

న్యూస్‌రీల్

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం(విశాఖ): విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను, గాయపడిన వారికి పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక విమానంలో సోమవారం మధ్యాహ్నం 1.19 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడ నుంచి 1.32 గంటలకు హెలికాప్టర్‌లో నేరుగా విజయనగరం వెళ్లారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతి, విశాఖ కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆర్డీవో హుస్సేన్ సాహేబ్, తహసీల్దార్ జయ తదితరులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో పాటు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సీఎం అదనపుకార్యదర్శి కె.ధనుంజయరెడ్డి విజయనగరం వెళ్లారు. బాధితులను పరామర్శించి సాయంత్రం 3.38 గంటలకు విశాఖఎయిర్‌పోర్టుకు సీఎం జగన్ చేరుకున్నారు. ఇక్కడ నుంచి ప్రత్యేక విమానంలో 3.58 గంటలకు గన్నవరం బయలుదేరారు. ఆయనకు మంత్రులు,అధికారులు వీడ్కోలు పలికారు.

‘స్పందన’కు 50 అర్జీలు



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: ‘స్పందన’ అర్జీలను వెంటనే పరిష్కరించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 50 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు మంజూరు చేయాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని, 516 నేషనల్ హైవే నిర్మాణంలో చెట్లు, ఇళ్లు నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని, కాలనీలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని అర్జీలు వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘సివిల్స్’ ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు పూర్తి



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అనంత పద్మనాభ రావు, రాజు, పీవో అభిషేక్

పాడేరు రూరల్: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత సివిల్స్ శిక్షణ కోసం రెండు రోజుల పాటు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో ఐటీడీఏ కార్యాలయంలో ఆల్ ఇండియా రేడియో రిటైర్డ్ అదనపు సంచాలకులు ఆనంద పద్మనాభరావు, మేఘాలయ రిటైర్డ్ అదనపు డీజీపీ పి.హెచ్.పి.రాజు ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. రెండు దశల్లో నిర్వహించిన రాత పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన 156 మందిని ఇంటర్వ్యూలకు పిలిచినట్టు తెలిపారు. 29న 95 మంది, 30న 55 మందికి ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, వీరిలో 50 మందిని శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. వచ్చేనెల మొదటి వారంలో వేపగుంట యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని ఐటీడీఏ పీవో చెప్పారు.

సామాజిక విజయ భేరి

జన ప్రవాహం పరవళ్లు తొక్కింది... ఆ హోరుతో కొండలు ప్రతిధ్వనించాయి.. గుండెలు పులకించాయి.. అట్టడుగు బడుగుల జీవితాలను సాధికార వసంతాలతో నింపి, వర్తమానంతో భవిష్యత్తుకు వారధి వేసిన నవశక నిర్మాణ ధీరోదాత్తునికి సంఘీభావంగా గూడేలు పాడేరు దారి పట్టాయి... కొలమానానికి అందని అభిమానంతో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టాయి. గిరిజనులకు అందిన సాయాన్ని మంత్రులు వివరిస్తూ ఉంటే తమ బతుకుల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకున్నారు.... అందిన సాయాన్ని **నెమరువే**సుకున్నారు. చప్పట్లు, **నినాదాల** రూపంలో ఆనందం, **అభిమానం, కృత**జ్ఞతలు ప్రకటించారు. **నిశ్చయంగా మీ** వెంటే నడుస్తామంటూ **నినదించారు..** వెరసి పాడేరులో నిర్వ**హించిన బస్సు** యాత్ర భవిష్యత్తు విజ**యయాత్ర**ను తలపించింది.



పాడేరులో సామాజిక సాధికార సభకు హాజరైన అశేష గిరిజన వాహిని



సభా స్థలికి పాదయాత్రగా వెళుతున్న వైవీ సుబ్బారెడ్డి, భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, స్వాతిరాణి, సుభద్ర



సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, వేదికపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ మాధవి, తదితరులు

- పాడేరుకు పోటెత్తిన గిరిజనులు
- ప్రతిధ్వనించిన జగన్నినాదం
- వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్రకు విశేష స్పందన

సాక్షి,పాడేరు: ఎటు చూసినా జనమే... అందరి ముఖాల్లోనూ ఆనందమే... జీపులు, కారులు, ద్విచక్రవాహనాలు.. ఇలా కొందరు అందుబాటులో ఉన్న వాహనాల్లో, మరికొందరు నడుస్తూ వేల సంఖ్యలో పాడేరు చేరుకున్నారు. రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. థింసా నృత్యాలు..డప్పు వాయిద్యాలతో హోరెత్తించారు. ఇక్కడ సోమవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర గిరిజన జాతరను తలపించింది. పాడేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వేలాది మంది గిరిజనులు స్వచ్ఛందంగా ఉదయం 10 గంటలకే పాడేరు చేరుకున్నారు. చింతలవీధి పంచాయతీ తలారిసింగి మెడికల్ కళాశాల సెంటర్ నుంచి పాతబస్టాండ్, పాడేరు మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద సభా వేదిక వరకు ప్రజలు కిక్కిరిశారు. వైఎస్సార్‌సీపీ జెండాలు పట్టుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు దిక్కులు పిక్కటిల్లేలా జై జగన్ అంటూ నినాదాలు చేశారు. తలారిసింగి మెడికల్ కళాశాల భవన నిర్మాణాల ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి జెండా ఊపి సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీలు డాక్టర్ కుంభా రవిబాబు, లేళ్ల అప్పిరెడ్డి, పాడేరు, అరకులోయ, రాజాం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, కంబాల జోగులు, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఫరూఖీ, నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, జెడ్పీ, జీసీసీ చైర్‌పర్సన్‌లు జల్లిపల్లి సుభద్ర, డాక్టర్ శోభ స్వాతి రాణి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ యాత్ర మన్యం ప్రజల్లో జోష్ నింపింది.



జెండా పట్టిన వీరాభిమాని

బహిరంగ సభ అదుర్స్

పాడేరు మెయిన్‌రోడ్డులో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతమైంది. సభ జరిగిన విజయ కట్‌పీస్ సెంటర్ నుంచి స్టేట్‌బ్యాంకు వరకు వేలాది మంది ప్రజలతో కిక్కిరిసిపోయింది. సుమారు నాలుగు వేల వరకు వేసిన కుర్చీలన్నీ మహిళలతోనే నిండిపో యాయి. వారంతా వైఎస్సార్‌సీపీ టోపీలు ధరించి, జెండాలతో సందడి చేశారు. సభ ముగిసేంతవరకు ప్రజలు ఉత్సాహంగా నేతల ప్రసంగాలు విన్నారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి బహిరంగ సభ వేదికపై నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులుఅర్పించారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

గిరిజన సంక్షేమశాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు టీచర్లను ప్రభుత్వం రెగ్యులర్ చేయడంతో వారంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సభలో థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులను ప్రదర్శించారు. డిప్యూటీ సీఎంలు, అరకు ఎంపీ, పాడేరు, అరకులోయ, రాజాం ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యాత్ర సందర్భంగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు, కళాశాల నమూనాను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. అంతకు ముందు స్థానిక గిరిజన కళాకారులు థింసా నృత్యం చేస్తూ వీరికి ఘన స్వాగతం పలికారు.

ఆకట్టుకున్న కళా రూపకాలు

వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వంగపండు ఉషారాణి ఆధ్వర్యంలో జానపద కళాకారులు పాటలు, నృత్యాలతో హోరెత్తించారు. మెయిన్‌రోడ్డు సతకంపట్టు వద్ద ఏర్పాటుచేసిన సభావేదికపై సుమారు 3గంటల పాటు కళాకారుల పాటలు, డ్యాన్సులతో అందరిని అలరించా రు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మంచిని వివరిస్తూ గీతాలు ఆలపించారు. తలారిసింగి మెడికల్ కళాశాల భవన నిర్మాణాల ప్రాంతం, పాత బస్టాండ్, సతకంపట్టువద్ద మూడు బృందాల గిరిజన మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. తీన్‌మార్ బ్యాండు మోతతో పాడేరు పట్టణం మరింత సందడిగా మారింది.

బస్సుయాత్ర ఇలా..

అనంతగిరి(పాడేరు): పాడేరు మండలంలోని చింతలవీధి పంచాయతీ తలారిసింగి వైఎస్సార్ మెడికల్ కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌రోడ్డు, సినిమాహాల్‌సెంటర్, అంబేద్కర్ కూడలి మీదుగా సతకంపట్టు మెయిన్‌రోడ్డు వరకు వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర సాగింది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు తలారిసింగి వద్ద ఈ యాత్ర పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. సుమారు కిలోమీటరన్నర వరకు వేలాదిగా పార్టీ శ్రేణులు, అభిమానులు యాత్ర వెంట సాగారు. ఈ సందర్భంగా జై జగన్, జైజై జగన్ అంటూ పెద్ద ఎత్తున చేసిన నినాదాలతో పాడేరు పట్టణం హోరెత్తింది. మార్గ మధ్యంలోని పాతబస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ.సుబ్బారెడ్డి, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పాతబస్టాండ్ నుంచి సుమారు కిలో మీటరు దూరంలో గల మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు సభ ప్రాంగణం వరకు కార్యకర్తలు, నాయకులతో కలిసి పాదయాత్రగా వెళ్లారు.



బస్సు యాత్రలో పాల్గొన్న వాహన శ్రేణి

సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాడేరు రూరల్/అనంతగిరి: సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యపడిందని, 70 శాతం పదవులు, పథకాలు బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చారని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా పాడేరులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు ఒకే రకంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సమన్యాయం చేయాలన్న ఆలోచన చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. మూడు రాజధానుల ఏర్పాటుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని తెలిపారు. గత పాలకులు గిరిజనులను నిలువునా మోసం చేశారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గిరిజన అభివృద్ధే ధ్యేయంగా అనేక పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. నాడు–నేడు పథకం ద్వారా రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో ఉన్న 2,705 పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు మారాయన్నారు. గిరిజనుల ఆరోగ్య పరిరక్షణ కోసం జిల్లా కేంద్రమైన పాడేరులో రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణం జరుగుతోందన్నారు. ఆదివాసీల ఆర్థిక ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఐటీడీఏల ద్వారా కాఫీ సాగును ప్రోత్సహిస్తున్నట్టు ఆయన చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో గిరిజనాభివృద్ధికి కేవలం రూ.12వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలోనే ఏకంగా రూ.20వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం రాష్ట ప్రభుత్వం ఇప్పటి వరకు సుమారు రూ.4లక్షల కోట్లు ఖర్చు పెట్టినట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అగ్రవర్ణ పేదలకు కూడా సామాజిక న్యాయం జరిగిందన్నారు. గిరిజనులు ఎప్పుడూ వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని పిలుపునిచ్చారు.



మెడికల్ కళాశాల భవనాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు



జై కొడుతున్న గిరిజన మహిళలు

70 శాతం పదవులు ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకే : వైవీ సుబ్బారెడ్డి



పాడేరు రూరల్/అనంతగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 70 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే కేటాయించి సామాజిక న్యాయం చేశామని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గతప్రభుత్వం హయాంలో ఎన్నడూ సామాజిక న్యాయం జరగలేదన్నారు. పాడేరులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలోనూ అధిక శాతం పదవులు కేటాయించినట్టు చెప్పారు. గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. ఇందుకు పాడేరులో రూ.500 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలే నిదర్శనమన్నారు. గిరిజనుల మనుగడకు అడ్డంగా ఉన్న బాక్సైట్ జీవో 97ను రద్దు చేసి గిరిజనుల పక్షాన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని చెప్పారు. లక్ష ఎకరాల్లో ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చి రైతు భరోసా ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో 99 శాతం నాలుగున్నరేళ్ల కాలంలోనే అమలు చేసి చూపించామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన గిరిజనమంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, క్షతగాత్రులకు రాష్ట ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం, పార్టీ నేతలు తక్షణం స్పందించి సహాయ చర్యల్లో పాల్గొన్నారని తెలిపారు. సీఎం విజయనగరం చేరుకొని బాధితులను పరామర్శించడం వారికి కొండంత బలాన్నిచ్చిందన్నారు. అనంతరం విజయ నగరం జిల్లా రైలు ప్రమాద మృతుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు.



అతిథులకు థింసా నృత్యంతో స్వాగతం



మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి



సీఎం జగన్ చిత్రపటానికి కాంట్రాక్టు టీచర్ల క్షీరాభిషేకం

విమానాల వింటర్ షెడ్యూల్ ఖరారు

- రన్‌వే రీ–సర్ఫేసింగ్ నేపథ్యంలో వేళల మార్పు
- నవంబరు 15 నుంచి మార్చి 31 వరకు రాత్రివేళ రన్‌వే మూత
- అందుకనుగుణంగా చర్యలు చేపట్టిన విమానయాన సంస్థలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే విమానాలకు వింటర్ షెడ్యూలు ఖరారైంది. శీతాకాలం సీజన్‌లో ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ సీజనులో విమానయాన సంస్థలు విమాన సర్వీసుల సంఖ్యను పెంచుతూ ఉంటాయి. అయితే నవంబర్ 15 నుంచి మార్చి ఆఖరు వరకు విశాఖ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేను రీ–సర్ఫేసింగ్ చేయనున్నారు. ఇందుకోసం ఈ నాలుగున్నర నెలలు రాత్రి వేళ రన్‌వేను మూసివేస్తారు. ఆ మర్నాడు ఉదయమే తిరిగి తెరుస్తారు. అందువల్ల ఆ సమయంలో ఎయిర్‌పోర్టులోకి విమానాలను అనుమతించరు. ఈ నేపథ్యంలో విమానాశ్రయంలోకి రాకపోకలు సాగించే విమానయాన సంస్థలకు రీ–సర్ఫేసింగ్ దృష్ట్యా వేళలను సర్దుబాటు చేసుకోవాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఇదివరకే సమాచారం అందించింది. దానికనుగుణంగా ఆయా సంస్థలు షెడ్యూల్‌ను మార్చుకున్నాయి. ఫలితంగా 32 విమాన సర్వీసులు తమ షెడ్యూల్‌ను మార్పులు చేర్పులుచేసుకున్నాయి. ప్రస్తుతం విశాఖప ట్నం నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు ఒక్కటే నడుస్తోంది. ఈ విమానం రోజూ రాత్రి 10 గంటలకు విశాఖ వచ్చి 11 గంటలకు బయలుదేరుతుంది. నవంబరు 15 నుంచి ఈ విమానం మూడు గంటలు ముందు అంటే.. రాత్రి ఏడు గంటలకే వచ్చి ఎనిమిది గంటలకు వెళ్తుంది. దీంతో పాటు చెన్నై, ఢిల్లీ, బెంగళూరు, తిరుపతి, కర్నూలు, విజయవాడ, హైదరాబాద్, కడప, కోల్‌కతా, గోవా, జైపూర్, పోర్టుబ్లెయిర్, పూణే నుంచి వచ్చి, వెళ్లే దేశీయ విమాన సర్వీసులు కూడా తమ షెడ్యూల్ సమయాన్ని అరగంట నుంచి మూడు గంటల వరకు సర్దుబాటు చేసుకున్నాయి. కాగా రన్‌వే రీ–సర్ఫేసింగ్‌తో ఈ వింటర్ సీజనులో విమాన సర్వీసులు పెరగకపోగా కొన్ని తగ్గనున్నాయి.



రాత్రి వేళ దిగుతున్న విమానం

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించిన వారిపై ఫిర్యాదు

గూడెంకొత్తవీధి: అడవి పందులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చి విద్యుత్‌కు అంతరాయం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఈపీడీసీఎల్ ఏఈ ప్రభాకరరావు సోమవారం తెలిపారు. గూడెం నుంచి కొయ్యూరు మండల బూదరాళ్ల పంచాయతీకి వెళ్తున్న విద్యుత్ సరఫరా వారం రోజులుగా నిలిచిపోవడానికి అడవి పందుల కోసం అమర్చిన విద్యుత్ తీగలే కారణమని చెప్పారు. గూడెంలో సురవరం,పెదబాడు గ్రామాల నుంచి బూదరాళ్లలో కొన్ని గ్రామాలకు 11 కేవీ విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. పందుల కోసం అమర్చిన తీగలను తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు చెప్పారు. ఇక్కడి పరిస్థితిని పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేందర్‌నాథ్‌కు తెలిపామన్నారు.దీనిపై ఆయన స్పందిస్తూ క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించినట్టు చెప్పారు.

వణికిస్తున్న చలిగాలులు



ముంచంగిపుట్టులో మంచులో కట్టెలు తీసుకు వస్తున్న గిరిజన మహిళలు

ముంచంగిపుట్టు: ఆంధ్ర,ఒడిశా సరిహద్దు ప్రాంతంలో రెండు రోజుల నుంచి చలి గాలులు తీవ్రంగా వీస్తున్నాయి. దీనికి తోడు ఉదయం, సాయంత్రం వేళల్లో మంచు అధికంగా ఉండడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఉదయం 10 గంటల వరకు సూర్య కిరణాలు భూమిని తాకడం లేదు. దీంతో వాహనదారులు హెడ్‌లైట్ల వెలుగులో ప్రయాణం సాగించాల్సి వస్తోంది. చలి ఎక్కువగా ఉండడంతో మన్యం వాసులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

ఉత్తరాంధ్రకు 170 అదనపు బస్సులు



ద్వారకా బస్ స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

- ప్రమాదం నేపథ్యంలో పలు రైళ్ల రద్దు
- ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- రద్దీగా మారిన బస్ డిపోలు, స్టేషన్లు

సాక్షి, విశాఖపట్నం : విజయనగరం జిల్లాలో రైళ్ల ప్రమాద నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించింది. ప్రమాదం వల్ల విశాఖ నుంచి, విశాఖ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. దీంతో రైళ్లలో వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. ఇలా సోమవారం అర్ధరాత్రి వరకు విశాఖపట్నం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విశాఖకు దాదాపు 170 బస్సులను నడిపింది. విశాఖలోని ద్వారకా బస్ స్టేషన్‌తో పాటు మద్దిలపాలెం, గాజువాక, వాల్తేరు డిపోల నుంచి వీటిని అందుబాటులో ఉంచింది. ఈ బస్సులను పార్వతీపురం, సాలూరు, టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు నడిపింది. సాధారణంగా ఈ ప్రాంతాలకు ప్రతి 15–30 నిమిషాలకో బస్సు సర్వీసు చొప్పున అందుబాటులో ఉంటుంది. రైళ్ల ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లే వారి కోసం ఈ అదనపు సర్వీసులను నడిపారు. సోమవారం మధ్యాహ్నం వరకు 70 బస్సులను పంపగా, ప్రయాణికుల రద్దీ పెరుగుతుండడంతో మరో వంద బస్సులను సమకూర్చారు. సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల నుంచి కూడా విశాఖపట్నం వైపునకు అదనపు బస్సు సర్వీసులను నడిపేలా చర్యలు తీసుకున్నామని ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ 'సాక్షి'కి చెప్పారు. రైళ్ల దుర్ఘటన అనంతరం ఆదివారం అర్ధరాత్రి దాటే వరకు విశాఖ, విజయనగరంల నుంచి ప్రమాద స్థలికి ఆర్టీసీ బస్సులను పంపించామన్నారు. క్షతగాత్రులతో పాటు ప్రయాణికులను వాటిలో ఆస్పత్రులకు, విశాఖ, విజయనగరాలకు తరలించినట్టు తెలిపారు.

అదనపు బస్సులతో ఊరట

రైళ్ల రద్దుతో తమ గమ్యాలకు చేరుకోవడం ఎలా? అంటూ మదన పడుతున్న ప్రయాణికులు ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ బస్సులతో ఊరట చెందారు. రెగ్యులర్‌తో పాటు అదనపు బస్సులతో ఆయా డిపోలు, బస్‌స్టేషన్లు రద్దీగా మారాయి. బస్సుల్లో సీట్లన్నీ నిండిపోయాయి. పలు బస్సులు నూరు శాతం ఆక్యుపెన్సీతో నడిచాయి. రైళ్లు రద్దయ్యాయన్న బెంగ లేకుండా సమయానికి గమ్యస్థానం చేరుకునేలా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను ఏర్పాటు చేయడంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.



ద్వారకా బస్ స్టేషన్‌లో ప్రయాణికుల నిరీక్షణ

బస్సుల్లో ఆక్యుపెన్సీ ఫుల్

మరోవైపు రైళ్ల రద్దుతో వాటిలో ప్రయాణించాల్సిన వారు బస్సులను ఆశ్రయించారు. ఇలాంటి వారి కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ అదనపు బస్సులతో పాటు రెగ్యులర్ బస్సులు పూర్తి ఆక్యుపెన్సీతో నడిచాయి. చాలా బస్సులు నూరు శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)తో కిటకిటలాడుతూ రాకపోకలు సాగించాయి. సాధారణంగా హైదరాబాద్, విజయవాడ వైపు వెళ్లే రెగ్యులర్ బస్సుల్లో ఓఆర్ 50–60 శాతానికి మించవు. అలాంటిది సోమవారం ఆ బస్సుల సీట్లు కూడా ఫుల్ అయ్యాయి.

విశాఖలో ఏడుగురికి చికిత్స



రైల్వే హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బి.తేజేశ్వరరావు, పి.శ్రీనివాసరావు



కేజీహెచ్ క్యాజువాలిటీలో చికిత్స పొందుతున్న ఎం.వరలక్ష్మి, గొట్ట కమలమ్మ

- కేజీహెచ్‌లో నలుగురు, రైల్వే ఆస్పత్రిలో ఇద్దరు, అపోలో ఆస్పత్రిలో ఒకరు
- రైల్వే ఆస్పత్రిలో చేరిన స్పెషల్ గార్డు మరిపి శ్రీనివాసరావు మృతి

మహారాణిపేట/తాటిచెట్లపాలెం: విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో గాయపడిన మొత్తం ఎనిమిది మంది క్షతగాత్రులను విశాఖపట్నం తరలించారు. కేజీహెచ్‌లో నలుగురిని, ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రిలో ఒకరిని, రైల్వే హాస్పటల్‌లో ముగ్గురిని చేర్పించారు. వీరిలో పలాస పాసింజర్ స్పెషల్ గార్డు మరిపి శ్రీనివాసరావు(53) ఆదివారం రాత్రే రైల్వే ఆస్పత్రికి తీసుకువచ్చిన కొద్ది సమయంలోనే మరణించారు. ఈయన నగరంలో ఆరిలోవ ప్రాంతంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. బి.తేజేశ్వరరావు, పి.శ్రీనివాసరావులు రైల్వే హాస్పటల్‌లోనే చికిత్స పొందుతున్నారు. కేజీహెచ్‌కు తీసుకొచ్చిన నలుగురిలో విజయనగరం జిల్లా జామి మండలానికి చెందిన నల్ల కుమారి(30), గాజువాక దయాల్‌నగర్ ప్రాంతానికి చెందిన ముర్రు లక్ష్మి(40)కి సోమవారం శస్త్ర చికిత్స నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా సింగపురం గ్రామానికి చెందిన మోహిద వరలక్ష్మి(45), శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన గొట్ట కమలమ్మ(43) కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. రైలు ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్సలు అందించడానికి కేజీహెచ్ నుంచి నలుగురు వైద్యులు విజయనగరం వెళ్లారు.

ఆరిలోవ, తంగేడులో విషాదఛాయలు

ఈ ప్రమాదంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందారు. ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌లో ఉంటున్న మరిపి శ్రీనివాసరావు(53) పలాస పాసింజర్‌కు స్పెషల్ గార్డుగా ఉండగా.. కోటవురట్ల మండలం తంగేడు గ్రామానికి చెందిన శింగంపల్లి మధుసూదనరావు(53) రాయగడ పాసింజర్ (08504)కు లోకో పైలట్‌గా ఉన్నారు. మధుసూదనరావు ఉద్యోగరీత్యా విశాఖలోని 52వ వార్డు న్యూ కరాసాలో ఉంటున్నారు. ఈయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావుకు వృద్ధాప్యంలో ఉన్న తల్లితో పాటు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న భార్య అమల, పీజీ చదువుతున్న కుమార్తె హర్షప్రియ, ఏయూలో బీటెక్ చదువుతున్న కుమారుడు చంద్రదీప్ ఉన్నారు. వీరి మృతితో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. వారిని వారించడం ఎవరితరం కావడంలేదు. వీరి రోదనలను చూసి స్థానికులు కంటతడిపెట్టారు.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

మరికొన్ని రీ షెడ్యూల్, గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: విజయనగరం జిల్లాలో రైళ్ల ప్రమాద ఘటన నేపథ్యంలో ఆయా స్టేషన్ల నుంచి సోమ, మంగళవారాల్లో బయల్దేరాల్సిన సుమారు 47 రైళ్లు రద్దు చేయగా 24 రైళ్లను దారి మళ్లించారు. అలాగే 8 రైళ్ల గమ్యం కుదించగా మరో 8 రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ అరుణశ్రీ పర్యవేక్షణలో క్యాన్సిలేషన్, హెల్ప్ లైన్, ఎంక్వయిరీ వద్ద ప్రయాణికులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. రైళ్ల రద్దు సమాచారం ప్రయాణికులకు మెసేజీలు, మీడియా ద్వారా తెలియజేశారు. దీంతో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల తాకిడి తగ్గింది. కొందరు దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు మాత్రం రైల్వేస్టేషన్‌లోనే ఉండిపోయారు. సోమవారం సాయంత్రం నుంచి పలు రైళ్లను అంచెలంచెలుగా పునరుద్ధరించడంతో ప్రయాణికులకు ఊరట లభించింది. సోమవారం ఉదయం నుంచి రైళ్లు రద్దు కావడంతో రైల్వే స్టేషన్‌లో పలు ప్లాట్‌ఫాంలు ఖాళీగా దర్శనమిచ్చాయి. అయితే విశాఖపట్నం నుంచి విజయవాడ, కేకే లైన్ వైపు రైళ్లు మాత్రం యథావిధిగానే నడిచాయి.



ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న ప్రయాణికులు

నేడు రద్దయిన రైళ్లు

విశాఖపట్నం–గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, తిరుపతి–విశాఖపట్నం(08584) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, కోరాపుట్ – విశాఖపట్నం(18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, రాయగడ–విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్, విజయనగరం–విశాఖపట్నం(07469) మెము స్పెషల్, తిరుపతి–పూరీ(17480) ఎక్స్‌ప్రెస్, పలాస–విశాఖపట్నం (08531) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం(08522/08521), విశాఖపట్నం–రాయగడ(08504) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–పలాస(08532) పాసింజర్ స్పెషల్, హౌరా–సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎస్ఎంవీ బెంగళూరు(12245) దురంతో ఎక్స్‌ప్రెస్, షాలిమార్–హైదరాబాద్(18045)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్

ఒకటో తేదీన రద్దు చేసిన రైళ్లు

రాయగడ–విశాఖపట్నం(08503) పాసింజర్ స్పెషల్, పలాస – విశాఖపట్నం(08531) పాసింజర్ స్పెషల్. అలాగే మంగళవారం ఆయా స్టేషన్లలో బయల్దేరాల్సిన పలు రైళ్లు రీ షెడ్యూల్ చేశారు. అక్కడ బయల్దేరిన సమయాన్ని బట్టి ఆయా స్టేషన్లకు అంతే ఆలస్యంగా చేరుకోనున్నాయి. మంగళవారం భువనేశ్వర్‌లో ఉదయం 05.40 గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్–బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా ఉదయం 10 గంటలకు బయల్దేరుతుంది.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ , చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, నాయకులు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: మహాత్మ గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమైందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మట్టుజోరు పంచాయతీ కేంద్రంలో సోమవారం నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ కేంద్రం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గ్రామ స్థాయిలోనే అందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గిరిజనులకు పథకాలు అందించడమే కాకుండా సమస్యలు సత్వర పరిష్కారమవుతున్నాయని, గిరిజనులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. గతంలో ఏ సమస్య తలెత్తినా, ఏ పని చేయాలన్న మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం జగన్ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థల ద్వారా సమస్యలకు చెక్ పడిందన్నారు. గ్రామ సచివాలయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ కూడా రాజుబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, ఎంపీడీవో వెంకటరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, కల్చరల్ విభాగ జిల్లా అధ్యక్షుడు దిలీప్‌కుమార్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎస్.కొండలరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు చిన్నబ్బి, సర్పంచ్‌లు సీదరి సాంబ, కాకరి బొంజుబాబు, ఎంపీటీసీ పరదాని భీమలింగేశ్వరరావు, నాయకులు చిన్నయ్య, రాంబాబు, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



మాధవి మృతదేహం

కూనవరం: అనారోగ్యంతో ఓ విద్యార్థిని మృతి చెందింది. సంఘటనకు సంబంధించిన విద్యార్థిని తల్లిదండ్రులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పంద్రాజుపల్లి గ్రామానికి చెందిన ముచ్చిక మాధవి(15) కోతులగుట్టలోని కేజీబీవీలో 10వ తరగతి చదువుతుంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చి, ఈనెల 26న తిరిగి పాఠశాలకు వెళ్లింది. తమ పాపకు అదే రోజు రాత్రి నుంచి తెల్లవార్లు వాంతులు, విరేచనాలు అవుతున్నా పాఠశాల యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించారు. విషయం తెలుసుకొని, ఇంటికి తీసుకొచ్చి మరుసటి రోజు కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రిలో జాయిన్ చేశామని, అక్కడ సరైన వైద్యం అందక ప్రైవేట్ వైద్యుని సలహా మేరకు భద్రాచలంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినట్టు వారు చెప్పారు. అక్కడి వైద్యులు వివిధ పరీక్షలు చేసి తమ పాప డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ బాధపడుతుందని, పరిస్థితి విషమించినట్టు వైద్యులు చెప్పారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మాధవికి చికిత్స అందిస్తుండగానే మృతి చెందినట్టు వారు తెలిపారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ప్రజాప్రతినిధులు

అనారోగ్యంతో భద్రాచలం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ముచ్చిక మాధవి మృతదేహాన్ని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ, చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్, జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్‌లు సందర్శించి మృతికి సంబంధించిన వివరాలు తెలుసుకొని ఆ కుటుంబాన్ని ఓదార్చారు..

కొక్కిరాపల్లి వద్ద వ్యాన్ బోల్తా

ఇద్దరికి తీవ్ర, 10 మందికి స్వల్ప గాయాలు



గాయపడిన వారిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ చింతపల్లి మండల అధ్యక్షుడు మోరి రవి

జి.మాడుగుల: మండలంలో కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డు మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చింతపల్లి మండలం కోరుకొండ, చెరువూరు, దిగజనభ గ్రామాలకు చెందిన 17 మంది వ్యాన్‌లో పాడేరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108వాహనంలో లోతుగెడ్డ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో తీవ్రంగా గాయపడిన చింతపల్లి మండలం సబ్బపల్లి గ్రామానికి చెందిన వందల కృపారావు, ఇదే మండలం కోరుకొండ గ్రామానికి చెందిన ఎస్.మత్స్యాలింగంను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకొన్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు తమర్బ నరసింగరావు సహాయక చర్యలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ చింతపల్లి మండల అధ్యక్షుడు మోరి రవి ఘటనా స్థలం, లోతుగెడ్డ,చింతపల్లి వెళ్లి చింతపల్లి ఆస్పత్రులకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు.

అన్ని రంగాల కార్మికులకు ఈ -శ్రమ్ కార్డులు

చోడవరం సహాయ కార్మిక అధికారి సూర్యనారాయణ

చోడవరం: అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా విధిగా 'ఈ– శ్రమ్' కార్డులను పొందాలని చోడవరం సహాయక కార్మిక అధికారి పి. సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన పరిధిలో చోడవరం, సబ్బవరం, దేవరాపల్లి, కె. కోటపాడు, బుచ్చెయ్యపేట, రావికమతం, చీడికాడ, మాడుగుల, అరకు, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, అనంతగిరి, డుంబ్రిగుడ, జి. మాడుగుల, హుకుంపేట మండలాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్టు, పారిశుద్ధ్య, తదితర రంగాల కార్మికులంతా విధిగా ఈ– శ్రామ్ కార్డులు పొందాలని సూచించారు. కార్డు కలిగిన కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షల బీమాతోపాటు 60 ఏళ్లు దాటిన వారికి పింఛన్ సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల్లో ఈ– శ్రమ్ కార్డులకు ఉచితంగా దరఖాస్తులు చేస్తున్నారని సూచించారు.